# దిక్సూచి

ఆంధ్రజ్యోతి
హైదరాబాద్, సోమవారం
10 ఆగస్టు, 2009




## 'ఆల్టర్నేటివ్' ఇంజనీరింగ్

# ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్ ఇంజనీర్స్




**ఇంజనీరింగ్ చేయాలనుకోవడం ఒక ఎత్తు. కోరుకున్న డిసిప్లెయిన్‌ను సమున్నత ఇంజనీరింగ్ సంస్థలో అధ్యయనం చేయాలనుకోవడం మరొక ఎత్తు. సాంకేతిక విద్య అనగానే ఫ్యాకల్టీతో మొదలుకుని ల్యాబ్ తదితర సదుపాయాల వరకు అన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఇంజనీరింగ్ కాలేజీల సంఖ్య పెరిగినప్పటికి, నాణ్యత విషయంలో సందేహాలు వెల్లువెత్తుతున్న రోజులివి. ఎంసెట్‌లో ర్యాంకు పెరిగిందంటే, మంచి కాలేజీపై ఆశలు వదులుకోవాల్సిందే. ఈ నేపథ్యంలో రెగ్యులర్ కోర్సుకు ప్రత్యామ్నాయంగా పేర్కొనదగిన వాటిలో ఒకటి, ద ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్స్ (ఐఇటిఇ) అందించే డిగ్రీ స్థాయి కోర్సు.**

ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్, కంప్యూటర్, ఐటి వృత్తి నిపుణులకు సంబంధించి సమున్నత సంస్థగా ద ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్స్ (ఐఇటిఇ) పని చేస్తోంది. ఈ మూడింటికి తోడు సంబంధిత అంశాలపరంగా శాస్త్ర, సాంకేతిక పురోగతిపై ఈ సంస్థ దృష్టిసారిస్తుంది. అందులో భాగంగానే ప్రాథమిక ఇంజనీరింగ్ సంబంధ విద్యా కార్యక్రమాలను చేపడుతోంది. సుమారు అరవై తొమ్మిదివేల మందికి ఈ సంస్థలో సభ్యత్వం ఉంది. వ్యక్తిగత సభ్యులకుతోడు వివిధ పరిశ్రమలు, సంస్థలకు సైతం భాగస్వామ్యం ఉంది. దేశవ్యాప్తంగా సంస్థకు 53 సెంటర్లు ఉన్నాయి. నేపాల్ రాజధాని ఖాట్మండ్‌లో సైతం కేంద్రం ఉంది.

డిప్లొమాతో మొదలుపెట్టి, పీజీ స్థాయి వరకు కోర్సులను నిర్వహిస్తోంది. స్వల్పకాలవ్యవధి కోర్సులనూ నిర్వహిస్తూ ఉంటుంది. గ్రాడ్యుయేట్ స్థాయి కోర్సు ఎఎంఐఇటిఇని ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో అందిస్తోంది. డిప్లొమా స్థాయిలో డిఐపిఐఇటిఇని ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్ అండ్ టెలికమ్యూనికేషన్‌లలో నిర్వహిస్తోంది. ఈ సంస్థ అందించే ఇంజనీరింగ్ డిగ్రీతో ప్రభుత్వ కొలువులు పొందవచ్చు. అలాగే డిప్లొమా స్థాయి కోర్సులకూ గుర్తింపు ఉంది. పీజీ స్థాయిలో ఉండే అడ్వాన్స్‌డ్ లెవెల్ కోర్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్ (ఎఎల్‌సిసిఎస్)ను ఎంటెక్ కంప్యూటర్ సైన్స్‌తో సమానమైన కోర్సుగా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ గుర్తించింది.

ఫిజిక్స్, మేథ్స్ తప్పనిసరి సబ్జెక్టులతో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు ఎఎంఐఇటిఇ చేసేందుకు అర్హులు.




వయసు పదహారు సంవత్సరాలకు తక్కువ కాకూడదు. ఫిజిక్స్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్స్‌లో ఉన్నత చదువు లేదా ఎలక్ట్రానిక్స్ టెలికమ్యూనికేషన్/ ఎలక్ట్రికల్/ కంప్యూటర్స్‌లో డిప్లొమా పాసైనా పర్వాలేదు.

డిప్లొమా కోర్సులు చేయాలంటే అభ్యర్థి వయసు పద్నాలుగు సంవత్సరాలు నిండి ఉండాలి. టెన్త్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు ఈ కోర్సు చేయవచ్చు.

ఎఎల్‌సిసిఎస్ చేయాలంటే బిఇ/ బిటెక్/ ఎఎంఐఇటిఇ/ ఎఎంఐఇ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఎంసిఎ/ ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, ఫిజిక్స్, మేథ్స్, స్టాటిస్టిక్స్, ఆపరేషన్స్ రీసెర్చ్ చేసి ఉండాలి.

ఎఎంఐఇటిఇ డిగ్రీ స్థాయి ఇంజనీరింగ్ కోర్సు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖకు తోడు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్, ఐఐటి గేట్, రైల్వే మంత్రిత్వ శాఖ, వివిధ రాష్ట్రాల్లోని యూనివర్సిటీలు ఈ కోర్సును ఇంజనీరింగ్‌లో డిగ్రీతో సమానమైనదిగా గుర్తించాయి.

డిగ్రీస్థాయిలో కొత్త సిలబస్‌ను రూపొందించారు. ఈ ఏడాది జూన్ నుంచి కొత్త సిలబస్‌తోనే పరీక్షలు నిర్వహిస్తున్నారు.

డిగ్రీ స్థాయి కోర్సు రెండు సెక్షన్లుగా ఉంటుంది. ప్రతి సెక్షన్లో రెండు పార్టులు ఉంటాయి. మొత్తమ్మీద 24 పేపర్లు రాయాల్సి ఉంటుంది. దాదాపుగా ప్రతి పార్టులో ప్రాక్టికల్స్ తప్పనిసరి. సంస్థలో సభ్యులుగా చేరిన విద్యార్థులకు సంస్థ ఎలాంటి స్టడీ మెటీరియల్ ఇవ్వదు. సిలబస్, పుస్తకాలను మాత్రమే నిర్దేశిస్తుంది. పాత పరీక్ష పేపర్లు అందుబాటులో ఉంటాయి. నిబంధనలకు లోబడి నిర్దేశిత పేపర్లు పాస్ కావడం ద్వారా డిగ్రీ పొందవచ్చు.

పరీక్షలు ఏటా రెండు సార్లు నిర్వహిస్తారు. జూన్ 15 నుంచి 22 వరకు, డిసెంబర్ 15 నుంచి 22 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏ సంవత్సరమైనా జూన్‌లో పరీక్ష రాయదలుచుకున్న అభ్యర్థులు ఫిబ్రవరి 28/29లోపు సభ్యులుగా నమోదుకావాలి. అదే డిసెంబరులో పరీక్ష రాయాలనుకుంటే ఆగస్టు 31లోపు నమోదు కావాలి. పరీక్షకు ఉద్దేశించిన దరఖాస్తులను ఏటా జూన్‌కు ఏప్రిల్ 25లోగా, డిసెంబరుకు అక్టోబర్ 25లోగా పంపుకోవాల్సి ఉంటుంది. సభ్యత్వ రుసుము, పరీక్ష ఫీజులు తదితరాల కోసం అయ్యే వ్యయం రూ.పదివేలకు మించదు. కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు తుది మార్కుల షీట్, ప్రొవిజనల్/ ఫైనల్ సర్టిఫికెట్ పొందాలంటే ఇంప్రూవ్‌మెంట్ రాయబోమని అండర్‌టేకింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. డిగ్రీ అయితే రూ.3,150, డిప్లొమాకు రూ.3650 చెల్లించి వాటిని పొందవచ్చు.

### హైదరాబాద్‌లో

హైదరాబాద్‌లో ఐఇటిఇ సెంటర్ 1973లో ఏర్పాటైంది. మూడు ఎకరాల సువిశాల విస్తీర్ణంలో, ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోనే ఈ సెంటర్ ఉంది. ఇంజనీరింగ్ విద్యార్థులకు అవసరమైన ప్రాక్టికల్ సదుపాయాలు అన్నీ ఇక్కడ ఉన్నాయి. పక్కా భవనాలు, అత్యాధునిక సదుపాయాలు ఇక్కడ ఉన్నాయి. మంచి లైబ్రరీ దీని సొంతం. 300 మంది కూర్చునే వీలున్న ఎసి ఆడిటోరియం సైతం ఉంది. ప్రసుతం దీన్లో 1900 వరకు కార్పొరేట్ మెంబర్లు, 1724 మంది స్టూడెంట్ మెంబర్లు ఉన్నారు. 30 స్టూడెంట్ ఫోరమ్‌లు కాగా 15 మంది పారిశ్రామిక సభ్యులు. వరంగల్, గుల్బర్గా సబ్‌సెంటర్లుగా దీని పరిధిలో పనిచేస్తున్నాయి. తిరుపతి సెంటర్ సైతం దీని పరిధిలో ఉండేది. గత ఏడాదే అది స్వతంత్రప్రతిపత్తి పొందింది. ఇవి కాకుండా విజయవాడ, విశాఖపట్నంలో సెంటర్లు ఉన్నాయి.

ఎంటెక్ కంప్యూటర్ సైన్స్‌తో సమానమైన ఎఎల్‌సిసిఎస్ కోర్సును ఢిల్లీతో పాటు హైదరాబాద్ సెంటర్ సైతం నిర్వహిస్తోంది. మరో ముఖ్య విషయం, హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం, జెఎన్‌టియు ఈ కోర్సుకు ఎంటెక్ స్థాయి గుర్తింపునిచ్చాయి. అర్హతలు, అనుభవం ఉన్న గైడ్ల పర్యవేక్షణలో ఏటా 300 మంది బిఇ/బిటెక్ విద్యార్థులు ఇక్కడి సెంటర్లో తమ ప్రాజెక్టు వర్క్‌లను పూర్తి చేస్తుంటారు. భారతి ఎయిర్‌టెల్ సర్వీసెస్ లిమిటెడ్ ఇక్కడ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా, ఐఇటిఇ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంటుంది. బెస్ట్ లోకల్ సెంటర్‌గా పలుమార్లు హైదరాబాద్ సెంటర్ ఎంపికైంది. ఐఇటిఇ అందించే ఇంజనీరింగ్‌లో పీజీ, డిగ్రీ, డిప్లొమా కోర్సులకు తోడు డిఓఇఎసిసి ఎ లెవెల్, బి లెవెల్ కోర్సులకూ శిక్షణ అవకాశాలు ఉన్నాయి.

### దరఖాస్తు

State Bank of Hyderabad, OUలో చెల్లే విధంగా Hony. Secretary, IETE, Hyderabad Centre పేర రూ.250కి తీసుకున్న క్రాస్డ్ డిడిని The Hony. Secretary IETE, Near OU Post Office, Osmania University Campus, Hyderabad - 500 007. A.P. India చిరునామాకు పంపి దరఖాస్తులు పొందవచ్చు.

– వాహిని

### మంచి అవకాశం



– డాక్టర్ వి.గుణశేఖర్ రెడ్డి,
ఛైర్మన్,
ఐఇటిఇ హైదరాబాద్ సెంటర్

అత్యున్నత ప్రమాణాలతో ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ఇంజనీరింగ్‌లో డిగ్రీతో సమానమైన ఎఎంఐఇటిఇ ని మా సంస్థ అందిస్తోంది. ఈ మూడు అంశాల్లో ప్రమాణాలతో కూడిన ఇంజనీరింగ్ డిగ్రీని అందుకునే అవకాశం ఇది. ఎంసెట్‌లో మంచి ర్యాంకు రాకపోవడమే కాదు, డిప్లొమా ఉత్తీర్ణులై అర్హత పెంచుకోవాలని భావించే వారికి ఇది మెరుగైన కోర్సు. డిప్లొమా ఉత్తీర్ణులకు వారి సిలబస్‌కు లోబడి సెక్షన్ ఎ లో రెండు పేపర్ల వరకు మినహాయింపునకు అవకాశం ఉంటుంది. ఈ అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకోవచ్చు. సబ్జెక్టు, ప్రమాణాలు, ప్రాక్టికల్ అనుభవం తదితరాల్లో ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలకు తీసిపోని విధంగా ఈ కోర్సులను తమ సంస్థ తీర్చిదిద్దింది.

హైదరాబాద్ సెంటర్ విషయానికి వస్తే, కోర్సుకు అవసరమైన అన్ని సదుపాయాలు అంటే లేబ్ తదితరాలన్నీ ఉన్నాయి. కోర్సుకు అవసరమైన కోచింగ్ సదుపాయం సైతం అందిస్తున్నాం. ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోనే ఉండటం వల్ల ఫ్యాకల్టీ సమస్య ఎదురుకావటం లేదు. నిష్ణాతులైన యూనివర్సిటీ ప్రొఫెసర్లు అందుబాటులో ఉంటున్నారు. పీజీ స్థాయి కోర్సు ఎఎల్‌సిసిఎస్‌ని 18 సంవత్సరాలుగా నడుపుతున్నాం.

సంప్రతించాల్సిన నెంబర్లు: **040– 27098035, 27095128** . మొబైల్: **9346017700**
ఈ మెయిల్: **info@ietehyd.org**

---

## స్టార్ ఎడ్యుకేషన్ లోన్

# బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా విద్యార్థులకు చేయూత ఇచ్చే లక్ష్యంతో నిర్వహిస్తున్నది స్టార్ ఎడ్యుకేషన్ లోన్. విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు ఈ రుణం ఇస్తారు. ప్రతిభ ఉన్న ఏ ఒక్క విద్యార్థికి ఉన్నత విద్యాభ్యాసానికి వనరుల కొరత అవరోధం కాకూడదన్నది ఈ లోన్ ఉద్దేశం. అందుకే బ్యాంక్ ఆఫ్ ఇండియా తేలికపాటి నియమనిబంధనలు, షరతులతో స్టార్ ఎడ్యుకేషన్ లోన్ అందిస్తోంది. ప్రాథమిక విద్యా స్థాయి నుంచి అన్ని రంగాల్లో చక్కని ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు లోన్ మంజూరు చేసే విషయంలో ప్రాధాన్యం ఉంటుంది. రుణం తీసుకునే విద్యార్థి తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు కో బారోయర్‌గా తప్పనిసరిగా ఉండాలి. విద్యార్థి శాశ్వత నివాసానికి చేరువలో ఉండే బ్రాంచి నుంచి రుణానికి దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. రుణం తీసుకునే వ్యక్తి, కో బారోయర్‌గా ఉన్న వ్యక్తి ఇద్దరూ తప్పనిసరిగా ఈ రుణం తీసుకునే వారి కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకోవలసి ఉంటుంది. దీనికి చెల్లించాల్సిన ప్రీమియం కూడా రుణంలో భాగంగానే మంజూరు చేస్తారు.

రుణాన్ని దశలవారీగా ఎప్పటి అవసరాలకు అనుగుణంగా అప్పుడు బట్వాడా చేస్తూ ఉంటారు. అది కూడా విద్యాభ్యాసం చేస్తున్న సంస్థ లేదా విద్యార్థికి విద్యాభ్యాసానికి అవసరం అయిన పరికరాలు, పుస్తకాలు సరఫరా చేస్తున్న వెండర్ల పేరు మీదనే రుణం వాయిదాలు విడుదల చేస్తూ ఉంటారు. తదుపరి వాయిదా రుణం పొందేందుకు అంతకు ముందు సెమిస్టర్ లేదా టర్మ్ పరీక్షలకు సంబంధించిన మార్కుల జాబితాను విద్యార్థులు బ్యాంకుకు సమర్పించాలి. విద్యార్థి లేదా అతని తల్లిదండ్రుల చిరునామా మారినట్లయితే తక్షణం బ్యాంకుకు తెలియచేయాలి. అలాగే విద్యార్థి ఒక కోర్సు నుంచి మరో కోర్సుకు మారాలనుకున్నా కూడా అందుకు సంబంధించిన సమాచారాన్ని రుణం మంజూరు చేసిన బ్రాంచికి తప్పనిసరిగా తెలియచేయాలి. అంతే కాదు అనివార్య కారణాల వల్ల విద్యాభ్యాసాన్ని మధ్యలోనే మానేసినా, మధ్యలోనే ఉద్యోగం వచ్చినా కూడా బ్యాంకుకు తప్పనిసరిగా తెలియచేయాలి. రుణం దరఖాస్తులను విద్యార్థులు భౌతికంగా సంబంధిత బ్రాంచి నుంచి తీసుకుని పూర్తి చేసి దాఖలు చేయవచ్చు లేదా ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేయవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారు తమ దరఖాస్తు ఏ స్థాయిలో పరిశీలనలో ఉన్నది, తాజా పరిస్థితి ఏమిటి వంటి విషయాలు స్వయంగా పరిశీలించుకోవచ్చు. రుణం మంజూరు విషయంలో తుది నిర్ణయాధికారం బ్యాంకుదే. ఎఐసిటిఇ పరిధిలోకి రాని వృత్తి విద్యా కోర్సులు, గుర్తింపు లేని విద్యా సంస్థలు అమలు జరుపుతున్న కోర్సులకు ఈ స్కీమ్ కింద రుణం మంజూరు చేయరు. స్టార్ ఎడ్యుకేషన్ లోన్‌కు ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజు లేదు.

### అర్హత

- తప్పనిసరిగా భారతీయ పౌరుడై ఉండాలి.
- నిర్దిష్ట ఎంపిక ప్రక్రియ ద్వారా దేశంలో లేదా విదేశాల్లో ఏదైనా వృత్తి విద్య లేదా సాంకేతిక విద్య అభ్యసించేందుకు అడ్మిషన్ పొంది ఉండాలి.
- ఏ ఇతర సంస్థ నుంచి ఎడ్యుకేషన్ లోన్ తీసుకుని ఉండకూడదు.

### ఏ కోర్సులకు రుణం ఇస్తారు?

బిఎ, బికామ్, బిఎస్సీ వంటి గ్రాడ్యుయేషన్ కోర్సులు, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు, పిహెచ్‌డి, ఇంజనీరింగ్, మెడికల్, అగ్రికల్చర్, వెటరినరీ, లా, డెంటల్, మేనేజ్‌మెంట్, కంప్యూటర్స్, ఐసిడబ్ల్యుఎఐ, సిఎ, సిఎఫ్ఎ వంటి వృత్తి విద్యా కోర్సులకు రుణం మంజూరు చేస్తారు. అలాగే డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ లేదా విశ్వవిద్యాలయాలకు అనుబంధ సంస్థలు గుర్తింపు ఇచ్చిన కంప్యూటర్ సర్టిఫికెట్ కోర్సులకు, ఐఐఎంలు, ఐఐటిలు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఎక్స్ఎల్ఆర్ఐ, నిఫ్ట్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైనింగ్ వంటి సంస్థలు నిర్వహించే కోర్సులకు కూడా రుణం ఇస్తారు. గుర్తింపు పొందిన సాయంకాల విద్యా విధానంలో అభ్యసించే కోర్సులకు కూడా రుణ సదుపాయం ఉంది. అలాగే మంచి పేరు ప్రఖ్యాతు



లున్న విదేశీ విద్యా సంస్థలు దేశంలో నిర్వహించే కోర్సులకు కూడా రుణం ఇస్తారు.

ఇక విదేశాల్లో విద్యాభ్యాసం చేయడానికి ఉద్యోగాలు వచ్చేందుకు అవకాశం ఉన్న అన్ని వృత్తి పరమైన, సాంకేతికపరమైన కోర్సులకు రుణం మంజూరు చేస్తారు. ఇవి కాకుండా గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు కూడా రుణం ఇస్తారు.

### కవరేజ్

ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, ఎగ్జామినేషన్ ఫీజు, పుస్తకాలు, పరికరాలు కొనుగోలు వ్యయాలు, కాషన్ డిపాజిట్, ప్రయాణ ఖర్చులు, కంప్యూటర్ లేదా లాప్‌టాప్ వంటివి కొనడానికి అయ్యే ఖర్చు, స్టడీ టూర్లు అన్నింటికీ కవరేజ్ ఉంది.

### ఎంత రుణం ఇస్తారు?

దేశంలో విద్యాభ్యాసానికి – గరిష్ఠ మొత్తం 10 లక్షలు
విదేశీ విద్యాభ్యాసానికి – గరిష్ఠ మొత్తం 20 లక్షలు

### మార్జిన్ మనీ

4 లక్షల రూపాయల లోపు రుణాలకు ఎలాంటి మార్జిన్ మనీ లేదు. 4 లక్షలు పై బడిన రుణాలకు ఇండియాలో అయితే 5 శాతం, విదేశీ విద్యాభ్యాసానికైతే 15 శాతం మార్జిన్ మనీ చెల్లించాలి.

### సెక్యూరిటీ

4 లక్షల లోపు రుణానికి ఎలాంటి సెక్యూరిటీ అవసరం లేదు. 4 లక్షల నుంచి ఏడున్నర లక్షల వరకు ఆ మొత్తానికి సరిపడ థర్డ్ పార్టీ సెక్యూరిటీ చూపించాలి. ఏడున్నర లక్షలు పైబడిన రుణానికి థర్డ్ పార్టీ సెక్యూరిటీతో పాటుగా భవిష్యత్తులో విద్యార్థి పొందబోయే ఆదాయాన్ని రుణం తిరిగి చెల్లింపు నిమిత్తం అసైన్ చేయాల్సి ఉంటుంది.

### వడ్డీరేటు

2009 ఏప్రిల్ 4 నాటికి అమలులో ఉన్న వడ్డీరేట్లు ఇలా ఉన్నాయి.

- 4 లక్షల లోపు రుణాలకు పిఎల్ఆర్ కన్నా 2.5 శాతం తక్కువ వడ్డీ వసూలు చేస్తారు. అయితే కనీస వడ్డీరేటు 9.5 శాతం తగ్గకూడదు.
- 4 నుంచి 7.5 లక్షలకు పిఎల్ఆర్ కన్నా 2 శాతం తక్కువ వడ్డీరేటు. కనీస వడ్డీరేటు 10 శాతం.
- 7.5 లక్షలు పైబడిన రుణాలకు పిఎల్ఆర్ కన్నా 1.25 శాతం తక్కువ వడ్డీరేటు. కనీస వడ్డీరేటు 10.7 5 శాతం.
- బాలికలకు వడ్డీరేటులో 0.5 శాతం రాయితీ ఉంది. దీని పరిమితి 50 వేల రూపాయలు.
- ఐఐటి కోర్సులు చదివే విద్యార్థులకు వడ్డీరాయితీ కూడా ఉంది.

### ఇతర చార్జీలు...

ముందుగా బ్యాంకుతో కుదుర్చుకున్న అంగీకారానికి భిన్నంగా విద్యాభ్యాసంలో ఏవైనా మార్పులు, చేర్పులు చేసుకుంటే ఏక మొత్తంలో, ఏక కాలంలో చెల్లించాల్సిన చార్జీలు ఉన్నాయి. 4 లక్షల లోపు అయితే 500 రూపాయలు, 4 నుంచి 7.5 లక్షల వరకు వెయ్యి రూపాయలు, ఏడున్నర లక్షలు దాటితే రెండు వేల రూపాయలు.

గ్రామీణ బ్రాంచిల నుంచి రుణాలు పొందిన గ్రామీణ విద్యార్థులపై ఎలాంటి చార్జీలు లేవు.

### రుణం చెల్లింపు కాలపరిమితి

కోర్సు పూర్తయిన రోజు నుంచి ఏడాది లేదా ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ఆరు మాసాల పాటు రుణం తిరిగి చెల్లింపునకు మారటోరియం అమలులో ఉంటుంది. అక్కడ నుంచి రుణంగా తీసుకున్న మొత్తాన్ని 5 నుంచి 7 సంవత్సరాల లోగా ఇఎంఐల రూపంలో తిరిగి చెల్లించాలి.

– దామరాజు

---

### ఈమెయిల్స్ గోల

❍ **మా అబ్బాయి ఇంటర్ చదువుతున్నాడు. వాడికి ఈమధ్య చాదస్తం బాగా ఎక్కువైంది. ఇంటర్నెట్‌లో చూసిన ప్రతి మెయిల్‌కి అతిగా స్పందిస్తున్నాడు. ఒక మతానికి సంబంధించిన ఫొటోలు వందమందికి పంపాడు. అడిగితే అలా పంపకపోతే కష్టాలొస్తాయని ఆ మెయిల్ పంపినవాడు బెదిరించాడట. ఈ మెయిల్స్‌లో వచ్చేవన్నీ మాకు చెప్పి మాచేత కూడా పాటించేలా చేస్తున్నాడు. ఉదాహరణకు ఇవి కొన్ని–**

- ఒక పాపులర్ సాఫ్ట్‌డ్రింక్‌ని తాగవద్దంటున్నాడు, అది టాయిలెట్ క్లీనర్ అంటాడు.
- సినిమాలకు వెళ్లొద్దంటాడు. ఆ కుర్చీలో ఎయిడ్స్ వైరస్ ఉన్న సూదులుంటాయట.
- ఫ్రీగా లాప్‌టాప్ వస్తుందని వేలాదిమందికి మెయిల్స్ ఫార్వాడ్ చేస్తున్నాడు. దానివల్ల ఎంతో సమయం వృధా అవుతోంది.
- బ్యాంకు అకౌంట్ వద్దంటున్నాడు. వాడెవడో నైజీరియాలోవాడు కోట్లకొలది ట్రాన్స్‌ఫర్ చేస్తాడంట, ఆపైన మొత్తం లాగేస్తాడట.

ఇలాంటి పిచ్చిపనులు చాలా చేస్తున్నాడు. ఏమి చేయాలో తెలియడం లేదు. అప్పటికీ నేను చెప్పాను. నేను చదువుకునే రోజుల్లో గొలుసు ఉత్తరాల గురించి. ఆ రోజుల్లో నేనొక అమ్మాయిని పెళ్లిచేసుకోవాలని వందకు పైగా దేవుడికి ఉత్తరాలు చేత్తో రాసి పంపాను. వందో ఉత్తరం తరవాత ఆమె మరెవర్నో చేసుకుని మలేషియా వెళ్లిపోయింది. అయినా మావాడు వినడంలేదు, మీరేదైనా కౌన్సిలింగ్ చేయగలరా? ఎప్పుడు తీసుకురమ్మంటారు?

**– కె.రాజశేఖర్, హైదరాబాద్**

✎ ఈమెయిల్స్ ద్వారా జాగ్రత్తలను ఆలోచించి పాటించవచ్చు గానీ అదృష్టం పరీక్షించుకొనే మెయిల్స్‌ని తక్షణం చెత్తబుట్టలోకి పంపండి. వందలాదిమందికి తన ఫొటోలు లీలలు లేఖల ద్వారా పంపించి ప్రచారం చేయమని ఏ దేవుడు కోరుకోడు. కోరుకుంటే అతడు దేవుడు కాడు, అతని భక్తులకు భక్తే లేదు. నేను కూడా ఈమెయిల్స్ బాధితుడినే. ఒక పత్రిక చందాదారులకు పెట్టిన పోటీలో పాల్గొని వారు చెప్పిన పుస్తకాలు అవసరం లేకపోయినా కొన్నాను. చిన్న చిన్న వస్తువులు పెద్ద పెద్ద ఖరీదుతో కొని ఏడాది తరవాత తెలుసుకున్నాను ఇది మార్కెటింగ్ మాయాజాలం అని. కాబట్టి టెక్నాలజీలో లాభాలతోపాటు నష్టాలు కూడా ఉన్నాయి. మీకు తక్షణ స్వస్థత కావాలంటే ఇంటర్నెట్ పీకేయండి.

### సెరెండిపిటీ

❍ **మా అబ్బాయి బాగా చదువుతాడు కానీ ఎప్పుడు చూసినా ఏవో పరికరాలు ముందేసుకొని పెద్ద సైంటిస్టులా పనిచేస్తాడు. వాడికి ఫ్రెండ్స్ లేరు. పరికరాలు, పుస్తకాలు తప్ప పనేం లేదు. ఎలా చెప్పినా వినడం లేదు. దయచేసి సలహా ఇవ్వండి?**

**– ఎస్.కె.రామదాసు, వరంగల్**

✎ మీవాడికి ఫ్రెండ్స్ లేరనే చిన్నలోపం తప్ప మిగతా సంగతి ఫర్వాలేదు. టీవీలో సీరియల్స్ చూస్తూ కాలం గడపడం లేదు కదా. అతని పనికి పరిశోధనల్ని కొనసాగనివ్వండి. అకస్మాత్తుగా ఏదో ఒక కొత్త విషయం అతడికి తెలియకుండా కనిపెట్టవచ్చు. ఇలాంటి ప్రక్రియను సెరెండిపిటీ అంటారు. సెరెండిపిటీ అంటే అకస్మిక ఆవిష్కరణ. ఒక పనిచేస్తుండగా లేదా ఒక ప్రయోగం చేస్తుండగా మరో అద్భుతమైన ఫలితం కనపడటం ఈ ప్రక్రియలోని విశేషం. సృజనాత్మకతతో ఒక పని మొదలెట్టినప్పుడు కొత్తవి కనిపెట్టడం మన శాస్త్రజ్ఞులకు అనుభవమే. కొలంబస్ ఇండియా కనిపెట్టడానికి బయలుదేరి అమెరికా పట్టాడు. బొమ్మలు చేసే శిల్పి బాల్‌పాయింట్ పెన్ను, వెటర్నరీ డాక్టరు న్యూమాటిక్ టైర్లు, ఒక సాధారణ బాటసారి సేఫ్టీ రేజరు, సంగీతకారుడు ఫొటోఫిల్మ్, మరో సైంటిస్ట్ అనుకోకుండా ఎక్స్‌రేలను కనిపెట్టారు. కాబట్టి మీవాడిని ప్రోత్సహించండి. చదువు పక్కనపెట్టనంతకాలం ఫర్వాలేదు.




డాక్టర్ బి.వి.పట్టాభిరామ్
M.A., Ph.D
www.pattabhiram.com


## క్రాస్‌రోడ్స్

చిరునామా: **క్రాస్‌రోడ్స్,** కేరాఫ్ ఎడ్యుకేషన్ డెస్క్, ఆంధ్రజ్యోతి, ప్లాట్ నెం.76, రోడ్‌నెం.70, అశ్విని ఎన్‌క్లేవ్, హుడాహైట్స్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500 033

### టెన్షన్... టెన్షన్

❍ నేను డిగ్రీ పాసయ్యాను. ప్రస్తుతం కాంపిటేటివ్ పరీక్షలు రాస్తున్నాను. నాకు విపరీతమైన టెన్షన్ పడే అలవాటుంది. దీనివల్ల ఇటీవల ఒక పరీక్ష సెంటర్‌కి వెళ్లడానికి బదులు మరో సెంటర్‌కి వెళ్లాను. వాళ్లు నన్ను రాయనివ్వలేదు. చివరకు నష్టపోయాను. ఈ టెన్షన్ నుంచి బయటపడాలంటే ఏం చేయాలి?

**– వై.తారక్‌రామ్, నందికొట్కూరు**

✎ కాంపిటేటివ్ పరీక్షకు వెళ్లేటప్పుడు కొంచెం ఒత్తిడి ఉండటం సహజమే. అది పరీక్ష రాసేలా ప్రేరణ కలిగిస్తుంది. కానీ అది జాగ్రత్తగా



తగ్గించుకొనే ప్రయత్నం చేయాలి. దానికి చిన్న చిట్కాలు పాటించండి. కొంత టెన్షన్ తగ్గుతుంది.

- ఎగ్జామినేషన్ తేదీ, సమయం ఒక కాగితంపై రాసి దానిని అద్దం మీద గమ్‌టేప్‌తో అతికించండి. రోజూ అద్దం చూస్తారు కాబట్టి మిస్సవ్వరు.
- ఎగ్జామినేషన్ సెంటర్ ఎక్కడుందో ముందుగానే ఒకసారి వెళ్లిరండి. ఒకసారి చూసినదైనా ఫర్వాలేదు. ఏ గేటులోంచి లోపలికి వెళ్లాలో కూడా చూసుకోండి.
- పరీక్షకు అవసరమయ్యే పెన్నులు, పెన్సిళ్లు, కంపాస్ లాంటి ఇతర సామగ్రి, ముఖ్యంగా హాల్‌టికెట్ అన్నీ ఒక సంచిలో వేసి సిద్ధంగా ఉంచండి.
- ముందురోజు త్వరగా పడుకోండి. ఉదయాన్నే లేవడానికి అలారం పెట్టుకోండి. సెంటర్‌కి అరగంట ముందే చేరేలా ప్లాన్ చేయండి. గంట ముందైనా ముప్పేమీలేదు.

### బిట్స్ – ఎస్సేలు

❍ పరీక్షలు రాసేటప్పుడు బిట్ ప్రశ్నలు ముందు రాయడం మంచిదా? ఎస్సే ప్రశ్నలు రాయడం మంచిదా. సెలవివ్వండి?

**– ఎ.కె.సూర్యప్రకాశ్, కర్నూలు**

✎ ముందుగా మీకు బాగా వచ్చినవి రాయాలి. తరవాత మిగతావి రాయాలి. ఏ ప్రశ్న ముందు రాయడం అనేది ప్రశ్న కాదు. ఏది బాగా రాయగలమో అనేది ఆలోచించాలి.